వర్షానికి తడిసిన ధాన్యం

తడిసిన ధాన్యం

వెల్దుర్తి, అక్టోబరు 21 ప్రభాతవార్త: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మరికొన్ని చోట్ల రోడ్లపై ఆరబెట్టారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

టీఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

కొండాపూర్, అక్టోబరు 21 ప్రభాతవార్త: టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభను జిల్లా కార్యదర్శి బి.సాయితేజ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో అధికారిగా ఎన్నికలు నిర్వహించి టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులుగా డి. బాలకృష్ణ, జనరల్ సెక్రటరీగా ఎ. వెంకయ్య, సహ అధ్యక్షురాలుగా జ్యోతి, శశికాంత్, కోశాధికారిగా ఎం. విజయ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సాయన్న, కార్యదర్శులుగా సంజయ్య, బాలయ్య, పూలమ్మ, రంజిత్, ఉమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి. సాయితేజ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా 40 శాతం ఫిట్‌మెంట్‌లో పాటు పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మమ్మల్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఎన్. రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 21 ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను యంత్రాంగం దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి 79 దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు-38, పింఛన్లు-02, ఎంప్లాయిమెంట్-05, డబుల్ బెడ్‌రూం ఇండ్లు-11, రుణమాఫీ-02, ఇతర సమస్యలు-21 దరఖాస్తులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును సమీక్షించడానికి ప్రత్యేకంగా ప్రతి కార్యాలయంలో అధికారికి బాధ్యత అప్పగించాలని సూచించారు. ప్రతి సోమవారం ఫిర్యాదుల దరఖాస్తులు పరిష్కారంపై పర్యవేక్షిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందజేసే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు వివిధ విభాగాలకు పంపించడం జరిగిందని, వాటిని పరిష్కరించడానికి నిర్ధిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిని ఉపయోగించుకోండి : తహసీల్దార్

మాట్లాడుతున్న తహసీల్దార్ గంగా భవాని

గుమ్మడిదల, అక్టోబరు 21 ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గంగాభవాని కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగా భవాని మాట్లాడుతూ మండల పరిధిలోని అన్నిగ్రామాల ప్రజలు ఎలాంటి అవసరాలు ఉన్నా, వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంబంధిత, ధరణి సమస్యలు, ఆరోగ్య సమస్యలు, గ్రామ పంచాయితీలలో ఉన్న ఎలాంటి సమస్యలకైనా, ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలకుపరిష్కారం లభిస్తుందని, ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్నా సంబంధిత పత్రాలను తీసుకొని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉప తహశీల్దార్ కరుణాకర్ రావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పవన్, పోలీస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి మండలంలో పర్యటించిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు

కౌడిపల్లి, అక్టోబరు 21, ప్రభాతవార్త: మెదక్‌జిల్లా కౌడిపల్లి మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించుకోవడానికి సోమవారం విచ్చేసిన శిక్షణా పొందిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, ఆయాశాఖలకు చెందిన అధికారులు ఘనస్వాగతం పల్కినారు. నాలుగురోజులపాటు కొనసాగే అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం స్వాగతంతో పాటు శిక్షణాధికారులతో పరిచయ వేదికను మండల ప్రత్యేకాధికారి సాయిబాబ అధ్యక్షతన కొనసాగింది. ముందుగా రాయిలాపూర్ గ్రామానికి విచ్చేసిన ఐఎఎస్, ఐపిఎస్ విభాగాలకు చెందిన అధికారుల్లో హర్యానా రాష్ట్రానికి చెందిన యోగేష్ కుమార్ ఇండియాన్ స్టాటిస్టికల్ సర్వీస్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హీతేష్ ఖండేల్వాల్ ఇండియన్ ఫారెస్ట్ ఆఫ్ సర్వీస్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశీష్ కుమార్(జిఎల్) ఇండియన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సర్వీస్, బీహార్ రాష్ట్రానికి చెందిన మోహిబుల్లా అన్సారి ఇండియాన్ పోలీస్ సర్వీస్, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సౌవిక్ (ఎజిఎల్) ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్ సర్వీస్‌లకు చెందిన అధికారులకు మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, ఎంపిడిఓ శ్రీనివాస్, ఆయా శాఖాలకు చెందిన అధికారులు పుష్పగుచ్చాలను అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేసిన సంక్షేమ పథకాల పనితీరు, అభివృద్ధిపై అధికారులకు వివరించారు. గ్రామానికి విచ్చేసిన శిక్షణ ఐఎఎస్ అధికారులను గ్రామ పెద్దలకు, మాజీ ప్రజా ప్రతినిధులకు పరిచయాలను చేయించారు. కార్యక్రమంలో ఎంపిఓ కరీముల్లా, ఎంఈఓ బాల్‌రాజ , ఎపిఎం సంగమేశ్వర్, ఎపిఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి సలీం, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీని తగ్గించడం సరికాదు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 21, ప్రభాతవార్త : గత ఏడాది పంపిణీ చేసిన చేపపిల్లల సంఖ్యలో సగం మాత్రమే ఈ ఏడాది పంపిణీ చేస్తామని ప్రభుత్వం నిబంధన విధించి చేప పిల్లలను సరఫరా చేయడం సరికాదని బిఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ మత్స్యకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షులు పడిగే ప్రశాంత్ మండిపడ్డారు. సిద్దిపేటలో వారు సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేపల ద్వారా ఉపాధి పొందే ముదిరాజ్ సామాజికవర్గానికి, మత్స్యకార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చేపల పంపిణీలో పునరాలోచన చేయాలన్నారు. చేపపిల్లల పంపిణీని సగానికి తగ్గించకుండా గత ప్రభుత్వం పంపిణీ చేసినట్లుగా పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. చేప పిల్లలు గతంలో కంటే సగమే పంపిణీ చేస్తే ముదిరాజ్‌ల ఆదాయం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. పూర్తిస్థాయిలో చేప పిల్లలను పంపిణీ చేయకుంటే ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

పోలీసు అమవీరుల సంస్మరణ దినోత్సవంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: పోలీసులు విపత్కర, క్లిష్టపరిస్థితుల్లో ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ప్లాగ్ డే) సందర్భంగా సోమవారం పోలీసు కమిషనరేట్ పెరేడ్ మైదానంలో పోలీసు కమిషనర్ డా. అనురాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పోలీసు గౌరవవందనం స్వీకరించి పోలీసు అధికారులతో కలిసి పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు వేసి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. ప్రజల రక్షణ, ధన, మాన ప్రాణాల కోసం అహర్నిశలు పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటంబ సభ్యులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడానికి శాంతిభద్రతలు చాలా ముఖ్యమని.. అందుకు పోలీసు పాత్ర సమాజానికి ముఖ్యమన్నారు. దేశ రక్షణ, ప్రజాస్వామ్య విలువలు కాపాడడంలో పోలీసులు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులు త్యాగాలకు సైతం భయపడకుండా కార్యసాధనలో వెనుకడుగు వేయకుండా రెట్టించిన సమరోత్సాహంతో అసాంఘీక శక్తులతో పోరాడి విజయాన్ని పొందాలని అకాంక్షించారు.

పోలీసు అమవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, సీపీ డా॥అనురాధ,పోలీసు అధికారులు

సీపీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ అమరులైన పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా పోలీసు శాఖ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. దేశ ప్రజల సురక్షిత జీవితాల కోసం తమ జీవితాలను పోలీసులు పణంగా పెడతారని పేర్కొన్నారు. అమవీరులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి వారి సాధక బాధకాలు తెలుసుకొని చిరుకానుకలు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనుచౌదరి పోలీసు కమిషనరేట్‌ను సందర్శించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు మలాల్లరెడ్డి, రామచంద్రారావు, సుభాష్‌చంద్రబోస్, మధు, అంజయ్య, కిరణ్, శ్రీధర్‌గౌడ్, ఉపేందర్, విద్యాసాగర్, శీను, రమేష్, మల్లేశంగౌడ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 21 ప్రభాతవార్త: జిల్లాలో వానాకాలం 2024-25 ధాన్యం కొనుగోళ్ల కోసం 497 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో మాట్లాడుతూ జిల్లాలో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు 89, దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలు 408 ఏర్పాటుకు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 235 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈసారి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడానికి జిల్లాలో మిల్లులు తక్కువగా ఉన్నందున, గత సీజన్‌లలో తీసుకున్న ధాన్యం సరైన సమయంలో బియ్యం అప్పగింత పూర్తి చేయలేకపోయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు జరపలేదు కాబట్టి జిల్లాలో ధాన్యం నిల్వ చేయడానికి గోదాముల అవసరం ఏర్పడిందన్నారు. కమిషనర్ సివిల్ సప్లైస్ తెలంగాణ వారి ఆదేశాల మేరు జిల్లాలో ధాన్యం నిల్వ చేయటకు ఖాళాగా ఉన్న గోదాములను ఎంపిక చేస్తున్నామని, ఈ గోదాముల్లో ధాన్యం నిల్వ పూర్తిగా పౌర సరఫరాల సిబ్బందిచే నిర్వహించే అవకాశం ఉన్నందున ధాన్యం నాణ్యతా ప్రమాణాల ప్రకారం మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. నాణ్యత లేని ధాన్యం కొనుగోలు చేసి అటు రైతులను, ఇటు అధికార యంత్రాంగాన్ని ఇబ్బంది పెట్టకూడదని ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. ఒక వేళ ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు భావిస్తే ఆ ధాన్యం లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిప్పి పంపటం జరుగుతుందని వివరించారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది తప్పనిసరిగా శుభ్రపరిచి, నాణ్యతా ప్రమాణాల ధాన్యం కొనుగోలు చేయాలని, ఒకవేళ తిప్పి పంపే అవకాశం ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తే అట్టి ధాన్యం లారీల రవాణా ఛార్జీలను కొనుగోలు కేంద్రాల నిర్వహణ కమీషన్ నుండి రికవరీ చేయటమే కాకుండా అట్టి సిబ్బందిపై కఠిన క్రమశిక్షణ కార్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అధికారులు తెలియజేసే సూచనలు, ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం మాత్రమే కాంటా వేస్తామని, ధాన్యం శుభ్రపరచాలని రైతులకు ముందే తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధిని గాలికొదిలేసిన ఎమ్మెల్యే హరీష్‌రావు

డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్

చిన్నకోడూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త

సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసిన ఎమ్మెల్యే హరీష్‌రావు కేవలం రాజకీయాల ప్రయోజనం, పేరు ప్రఖ్యాతల కోసం రాష్ట్రంలో తిరుగుతూ..ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ మండిపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హరీష్‌రావు స్వంత నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా తన అనుచరులతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. సిద్దిపేట నుంచి ఇల్లంతకుట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.148 కోట్లతో శిలఫలకం వేసి తూతూ మంత్రంగా పనులు ప్రారంభించారని తెలిపారు. నాలుగేండ్ల కాలం నుంచి పనులు పూర్తి చేయకుంటే హరీష్‌రావు ఎందుకు పట్టించుకోలేదన్నారు. తన మెప్పు కోసం బిఆర్ఎస్ శ్రేణుల చేత తప్పుడు ప్రకటనలు చేపిస్తూ ప్రభుత్వంపై నిందలు


మాట్లాడుతున్న నాగరాజుయాదవ్

వేస్తున్నారని తెలిపారు. హరీష్‌రావు ఎమ్మెల్యేగా వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిద్దుల కుమార్, ఉడుత జయంత్, ప్రశాంత్, నరేష్, మహేందర్, శేషు, వేణు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 21 ప్రభాతవార్త: అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమర వీరుల స్థూపం వద్ద అమర వీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి నివాళులర్పించారు. ఆర్ఎస్ఐ మహిపాల్ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ గౌరవ వందనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలను అడిగి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ధన,మాన ప్రాణాల రక్షణకు కృషి చేస్తున్న పోలీసులు, అమరులైన పోలీస్ కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పోలీసులు ప్రాణాలకు తెగించి ఎన్నో త్యాగాలు చేస్తూ వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తరపున ఎప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు.అక్టోబర్ 21 నుంచి 31 వరకు జాతీయ ఐక్యత కోసం ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పోలీసు అమరవీరుల ఫ్లాగ్ డే దినోత్సవం ముఖ్య ఉద్దేశం అమరులైన పోలీసుల జీవితాలనే మనం మార్గదర్శకంగా, ఆదర్శంగా మలుచుకుంటూ ప్రజా సేవకు, ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకు పునరంకితం కావడం అన్నారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్‌చిన్ ప్రాంతంలో మహారా కాస్తున్న 10 మంది సీఆర్పీఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, ఇప్పటి నుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ సంవత్సరంలో తీవ్రవాదులు, సంఘ విద్రోహశక్తుల దాడుల్లో 214 మంది పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను సర్వస్వం లభింపజేయడం, ఆయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ రోజు నుండి 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ, 2 కే రన్, ఓపెన్ హౌస్, వ్యాస రచన పోటీలు, ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిలీం వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మరణించి అమరులైన 214 మంది అధికారులు, సిబ్బంది పేర్లు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాస్ చంద్రబోస్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, ఆర్ఐ శైలేందర్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది, త్యాగమూర్తుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

సింగూరు ప్రాజెక్టు దృశ్యం

సింగూరుకు కొనసాగుతున్న వరద

-ఇన్‌ఫ్లో 5241, అవుట్ ఫ్లో 13471 క్యూసెక్కులు

పుల్కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త: సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 5241 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరంతా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. గత సెప్టెంబరు 5వ తారీఖున ప్రారంభమైన వరద నీటి ప్రవాహం ఇంకా నేటికీ కొనసాగుతూనే ఉంది. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 5241 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 13471 క్యూసెక్కులుగా నమోదయింది. ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో నీటి పారుదల శాఖ అధికారులు 6వ నంబరు క్రస్ట్‌గేటును 2 మీటర్ల ఎత్తు ఎత్తి 10746 క్యూసెక్కులు, రెండు జల విద్యుత్ గేట్ల ద్వార 13471 క్యూసెక్కులు అవుట్ ఫ్లో నమోదయింది. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29917 టీఎంసిలు కాగా అంతే స్థాయిలో నీటి నిల్వలు మేయింటేన్ చేస్తున్నారు. మంజీర నది నిరాటంకంగా ప్రవహిస్తుండటంతో నెలన్నర రోజులుగా నది పరివాహక ప్రాంతం జలకళతో సంతరించుకుంది.జెన్‌కో సారధ్యంలోని 7.5 జలవిద్యుత్ సామర్థ్యంగల రెండు టర్బయినల్లు పనిచేస్తున్నాయి.ఈ రెండు యూనిట్లు రోజుకు 0.36 మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. మంజీర రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి ఎంత మొత్తంలో వరద ప్రవాహం వస్తున్నదో అంతే నీటిని ఘనపురం (వనదుర్గప్రాజెక్టు)కు వదులుతున్నారు.

అంగన్‌వాడీలో కుళ్లిపోయిన గుడ్లు

కంగ్టి, అక్టోబరు 21 ప్రభాతవార్త: మండలంలోని ముర్కుంజాల్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ నుంచి సరఫరా చేసిన గుడ్లు పాడైపోయిందని బిఆర్ఎస్ యువత మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తెలిపారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ సెంటర్ 1 నుంచి గర్భిణీలు తీసుకుని వచ్చి చూడగా పాడైపోయినట్లు గుర్తించారు. మండలంలో అంగన్‌వాడీ సెంటర్‌లకు నాసిరకమైన గుడ్లను సరఫరా చేస్తున్నారని, అలాగే గుడ్లు చాలా చిన్నవిగా వస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కొందరు కాంట్రాక్టర్లు నీరుగారుస్తున్నారన్నారు. గర్భిణీలు బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికహారం సమృద్ధిగా ఉండాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేయడం జరుగుతుంది. అదేవిధంగా అంగన్‌వాడీలలో గర్భిణీలకు, కూరగాయలు వండి, వారికి సెంటర్ వద్దే వడ్డియ్యాలని మెనూ ఉండగా అలాంటి దాఖాలలు లేవని, వారికి, మెనూ ప్రకారం భోజనం అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

సిడిపిఓ సుజాత వివరణ

చరవాణి ద్వారా సంప్రదించగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌కు నెలలో రెండు విడతలుగా గుడ్లు సరఫరా చేస్తారని, వచ్చిన గుడ్ల ఫొటో గత 15వ తేదీలో పంచి పెట్టిన గుడ్లని, 15వ తేదీ తర్వాత డంప్ చేసిన గుడ్లు అలాగే ఉంచామని, తప్పకుండా సెంటర్‌కు విజిట్ చేసి సమాచారం ఇస్తామన్నారు. ప్రతి సెంటర్ టీచర్‌ను గుడ్లు మంచిగా ఉన్నవి తీసుకోవాలని సీడీపీఓ తెలిపారు. చెడిపోయిన గుడ్లు ఉంటే వెంటనే వెనక్కి పంపించాలని ఆమె తెలిపారు.

చెడిపోయిన గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు

విద్యుదాఘాతంతో రైతు మృతి

వెల్దుర్తి, అక్టోబరు 21 ప్రభాతవార్త: అడవి పందుల నుంచి రక్షణ కోసం పంట పొలానికి అమర్చిన విద్యుత్ వైర్ ప్రమాదవశాత్తు తగిలి రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని శయ్యంతరావుపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన రాసపల్లి కిషన్ (32) అడవి పందుల రక్షణ కోసం పంట పొలానికి అమర్చిన విద్యుత్ వైర్ ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌తో అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పాటుకు మహిళ మృతి

సిద్దిపేట రూరల్(తొగుట), అక్టోబరు 21, ప్రభాతవార్త : తొగుట మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లిలో మహిళా పిడ

ఉపాధ్యాయుడు బ్రహ్మయ్యకు అవార్డు అందజేసి సన్మానిస్తున్న దృశ్యం

దామరకుంట ఉపాధ్యాయునికి రాష్ట్రస్థాయి అవార్డు

మర్కుక్, అక్టోబరు 21 (ప్రభాతవార్త): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని వివిధరంగాలలో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి టీచర్ ఎక్సలెన్సీ అవార్డులను శారద ఎడ్యుకేషన్ సొసైటీ, స్కై లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర ప్లానిటోరియం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మర్కుక్ మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వైసి.బ్రహ్మయ్య అవార్డును అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పద్మశ్రీ అవార్డుగ్రహీత సోమయ్య, డాక్టర్ మైనష్‌జిందాల్, డాక్టర్ జోత్స్నారావు, డిఎంఆర్ఎల్ సైంటిస్టు తన్నీరు నిరంజన్, పోమ్యనాయక్, సొసైటీల వ్యవస్థాపకులు పట్నం కమలామనోహర్, నరేంద్రస్వామిల చేతుల మీదుగా అవార్డును అందజేయడంతో పాటు జ్ఞాపిక, సన్మానపత్రం, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వైసి.బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డు అందించిన సొసైటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలు

జగదేవ్‌పూర్, అక్టోబరు 21 (ప్రభాతవార్త): 68వ ఎస్‌జిఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లాల ఖోఖో టోర్నమెంట్‌లో సిద్దిపేట జిల్లా జూనియర్ బాలికల విభాగంలో కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పిట్ల రుచిత, మంద కీర్తన, ఎం.నవ్యలు మంచి ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. ఈనెల 27, 28 తేదీల్లో కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థినిలను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

అఖిలభారత యాదవ మహాసభ యువత విభాగం

సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎర్ర సత్యనారాయణ

నియామక పత్రం అందుకుంటున్న అధ్యక్షులు

హత్నూర, అక్టోబరు 21, ప్రభాతవార్త: హత్నూర మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర సత్యనారాయణయాదవ్‌ను, అఖిలభారత యాదవ మహాసభ యువత విభాగం సంగారెడ్డిజిల్లా అధ్యక్షునిగా నియమించినట్లు, సంఘం రాష్ట్ర యువజన విభాగం రాష్ట్రఅధ్యక్షులు జి.యశ్వంత్‌రాజ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబందించి సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన భాద్యతలను సక్రమంగా నిర్వహించి సంఘం పటిష్టతకు కృషిచేస్తానని అన్నారు.

మహిళలకు కోడి పిల్లల పంపిణీ

రాయపోల్, అక్టోబరు 21 ప్రభాతవార్త : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకుగాను మహిళా శక్తి పథకం ఎంతోగానో ఉపయోగపడుతుందని రాయపోల్ ఏపిఎం కిషన్ అన్నారు.సోమవారం మహిళ శక్తి పథకంలో భాగంగా మహిళలకు కోడిపిల్లలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 1100 కోడి పిల్లలను మహిళలకు పంపిణీ చేశామన్నారు. ఒక కోడి పిల్ల రూ. 105 చొప్పున చెల్లించినవారికి అందజేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి 50 కోళ్ల చొప్పున అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిసిలు కిష్టయ్య, రాజేశ్వరావు, రవీందర్, ప్రవీణ్, రోజా, సిఎలు మల్లేశం, నర్సింలు, మహిళలు రాధ, అనిత పాల్గొన్నారు

హరీష్‌రావు దిష్టిబొమ్మ దగ్ధం చేయడం హేయమైన చర్య

-ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త): ప్రజల సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడుతున్న హరీష్‌రావు పోరాటాన్ని జీర్ణించుకోలేక దిష్టిబొమ్మ దగ్ధం చేయడం హేయమైన చర్య అని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఏవిధమైన సౌకర్యాలు కల్పించినమో సవివరంగా వివరించిన హరీష్‌రావుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్వాసితుల పట్ల గౌరవంతో వ్యవహరించిన హరీష్‌రావు ఎల్లప్పుడూ మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూనే ఉంటారని అన్నారు. నిన్నటి విలేకరుల సమావేశంలో 90 శాతం సమస్యలు తీర్చామని ఇంకా మిగిలిఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు చొరవ చూపాలని అడిగారని అన్నారు. మల్లన్నసాగర్ నిర్మాణం సందర్భంగా టెంట్లు వేసి ఉపన్యాసాలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎందుకు చొరవ చూపడంలేదన్నారు.దమ్ముంటే మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీ తరహాలోనే మూసీ బాధితులకు పరిహారం ఇవ్వాలన్న హరీష్‌రావు డిమాండ్‌ను ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్వాసితులకు రావాల్సిన మిగిలిన ప్యాకేజీలు, ఇంటి స్థలాల సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మ దగ్ధం చేసి తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని, ప్రాణం ఉన్నంత వరకు ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: చేసిన అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పాత లింగాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి లింగం చారీ (36) హైద్రాబాద్‌లో మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడన్నారు. దసరా పండుగకు గ్రామానికి వచ్చి అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటున్నాడు. పనులు లేక కుటుంబ పోషణ కొరకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక భార్యభర్త మద్య తరుచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక, భార్యతో తరుచూ గొడవలు చోటు చేసుకుండటాన్ని జీర్ణించుకోలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఉరిపెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి అన్న సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రండి

క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు21, ప్రభాతవార్త: సమాజంలో రక్తదానం పట్ల నెలకొన్న అపోహాలు విడనాడి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఎస్సై బి. వెంకటేశ్‌లు అన్నారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఎన్నిసార్లు రక్తదానంచేసినా కూడా ఎటువంటి సమస్యలు తలెత్తవని, అది ఇతరులకు ప్రయోజనకరంగానే ఉంటుందని వారు పేర్కొన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురష్కరించుకుని ఆమనగల్లు పోలీస్ కార్యాలయం, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరానికి చెందిన బెంజ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుండి రక్తాన్ని సేకరించింది. ఆమనగల్లు ఎస్సై బి. వెంకటేశ్‌తో కలిసి క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 25 మంది రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛంధగా రక్తాన్ని దానం చేశారు. ఈసంధర్భంగా ఎస్సై వెంకటేశ్, అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న మరొకరి పునర్జన్మకు సాయపడుతుందన్నారు. రక్తదానం పట్ల సమాజంలో మరింత చైతన్యం తీసుకురావలసిన బాధ్యత స్వచ్ఛంధ సంస్థలు, యువజన సంఘాలపై ఉందన్నారు. ఆపద సమయంలో అవసరమైన రక్తం లభించక ఎందరో అభాగ్యులు అనేక అవస్థలు ఎదుర్కుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతులైన ప్రతి మనిషి ఎన్నిసార్లు అయినా రక్తాన్ని దానం చేయవచ్చని సూచించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ



పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదానం నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, ఆమనగల్లు పోలీస్ కార్యాలయం

దినోత్సవం పురష్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువత నుండి విశేష స్పందన లభించిందని లయన్స్‌క్లబ్ పీఆర్ఓ ఎంఏ పాష ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో ఉన్న హన్మంతురెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అమరవీరుల దినోత్సవం నివాళులు అర్పించారు. పోలీస్‌సిబ్బంది ఏఎస్ఐ యాదయ్య, బాల్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ నటరాజ్‌యాదయ్యగుప్త, జిల్లా కోఆర్డినేటర్, కసిరెడ్డి రాంరెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, గుజ్జరి నర్సింహ్మ, కోశాధికారి దోనాదుల మహేశ్, ఎంగలి బాలకృష్ణ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలపై కరపత్రం విడుదల

కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక నేతలు

- ఈ నెల 29న షాద్‌నగర్‌లో సెమినార్
- హాజరు కానున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, అక్టోబరు21, (ప్రభాతవార్త) : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిషస్కార మార్గాలు అనే అంశంపై సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ... ఈ నెల 29న ప్రజా సమస్యల పరిష్కారం మార్గాలపై పట్టణంలోని యూనివర్సల్ మిని హాల్‌లో సెమినార్ నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు అనేకసమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు 2500 నగదు తదితర సమస్యల పరిష్కరం కోసం రాష్ట్ర ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఉపాధి సమస్యల పెండింగ్ బిల్లులతో పాటు 2 లక్షల 61వేల కోట్ల రూపాయలు కేటాయించి రోజు కూలీ 600గా మార్చి 200 రోజుల పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనిముట్లు ఇవ్వాలని ఈ సెమినార్‌లో డిమాండ్ చేయనున్నట్లు వారు తెలిపారు. ప్రజల సమస్యలపై నిర్వహించే ఈ సెమినార్‌కు పేద ప్రజలు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి, సీపీఐచౌదరిగూడ మండల కార్యదర్శి జి.వెంకటేష్, సీపీఐ కొందుర్గు మండల కార్యదర్శి బి. నర్సింహ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు రమేష్‌యాదవ్, కె.రాజునాయక్, ఎం.కృష్ణ, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

ఆమనగల్లులో కళ్యాణలక్ష్మిచెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు21, ప్రభాతవార్త: తెలంగాణ పునర్నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అధికార పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర కాంగ్రెస్ సర్కారుకు రెండు కళ్ళు లాంటివని వాటిని సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనసాగిస్తున్నారని కొనియాడారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం తహశీల్దార్ సిహెచ్. లలిత అధ్యక్షతన జరిగిన కళ్యాణలక్ష్మి చెక్కులపంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్యలతో కలిసిలబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు బంగారు తెలంగాణ సాధన ధ్యేయంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ ప్రజాపాలన సాగిస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఉచిత కరంటు సరఫరా, సబ్సిడీ సిలిండర్‌వంటి సాహసోపేతమైన పథకాలను అమలు చేస్తూ ప్రజల మనస్సులను గెలుచుకుందన్నారు. సంక్షేమంతోపాటు ఉద్యోగ కల్పన, రహదారులు, ప్రాజెక్టుల నిర్మాణాలు, ఫోర్తుసిటీ, ట్రిబుల్ ఆర్ వంటి పథ కాలను అమలు పరుస్తుందన్నారు.ఎంపీడీఓ కుసుమమాధురి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, దుడ్డు కృష్ణయాదవ్, బైకనియాదమ్మశ్రీశైలంయాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, బిచ్యనాయక్, బిక్యనాయక్, వస్పుల మానయ్య, వస్పుల శ్రీశైలం, మెకానిక్‌బాబా, ఫరీద్, కృష్ణనాయక్, ఖాదర్ ఖాద్రి, సభావట్ శ్రీను,విజయ్, వెంకటయ్య,డి. మహేశ్, ఉన్నారు.

రిఫ్రిజిరేటర్ పేలి ఇంటికి నిప్పు

చాకలిపల్లి గ్రామంలో రిఫ్రిజిరేటర్ పేలి ఇంటి దగ్ధమైన దృశ్యం

చౌడపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త : చౌడపూర్ మండల పరిధిలోని చాకలిపల్లి గ్రామంలో చెంచుచెన్నయ్య ఇంట్లో గత నెలలో కొన్న రిఫ్రిజిరేటర్ పేలి,ఇంటికి నిప్పు అంటుకుంది.రిఫ్రిజిరేటర్ పేలడంతో ఇంటి పైకప్పుకు నిప్పు అంటుకొని మండల చెలరేగడంతఓ స్థానికులు మంటలను ఆర్పారు. అదృష్టవశాత్తు ఎలాంటా ప్రాణనష్టం జరగలేదు.రిఫ్రిజిరేటర్ పేలడంతో చాకలపల్లి గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు.

శ్రీరంగవరం గ్రామ మాదిగ మహావీర్ సంఘం నూతన కమిటీ

మేడ్చల్, అక్టోబరు 21, ప్రభాతవార్త ః మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో సోమవారం మాదిగ మహావీర్ సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా ఎం నర్సింహ, ఉపాధ్యక్షులుగా బి ఎల్లేష్, కే సురేందర్, ప్రధాన కార్యదర్శిగా కే రఘురాం, సంయుక్త కార్యదర్శిగా టి శ్రీహరి, కోశాధికారులుగా పి కిరణ్ కుమార్, ఎస్ అశోక్, సలహాదారులుగా బాలరాజు, భిక్షపతి, కృష్ణ, వెంకటేష్, పోచయ్య, శివయ్య, లింగం, సాయిబాబు, బాలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్, అక్టోబరు 21ప్రభాతవార్త : మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను మంజూరీ చేస్తున్నదని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలనికడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అద్యక్షురాలు అంజిలమ్మ అద్యక్షతన జరిగిన మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశానికి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ విజయ్ కుమార్,జిల్లా అడిషనల్ డిఆర్‌డి సరోజ, డిపి ఎంఐబి వీరయ్య,ఏపీఎం వెంకన్న తదితరులు హాజరైయ్యారు.ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి మాట్లాడుతు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళాసంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా కుటుంబాలను పేదరికం నిర్మూలన నిర్మించుకోవాలన్నారు. అంతేగాక పిల్లలను ఉన్నత చదువులు చదివించు కోవాలని సూచించారు. అలాగే ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు మెరుగు పరుచు కొని ఆర్థికంగా ఎదుగాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ప్రతిదాన్ని మీరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సమావేశంలో సీసీలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్ప మాలదార స్వాములకు

శామీర్‌పేటలో ఘన స్వాగతం

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :శామీర్‌పేట రాజీవ్‌రహదారిన మెట్‌పల్లి,సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన శ్రీఅయ్యప్పమాలధార స్వాములు 42మంది శబరిమలైకి పాదయాత్రతో వెళ్తున్న వారికి శామీర్‌పేట గౌడ సంఘం సభ్యులు ఘనంగ స్వాగతం పలికారు. సోమవారం శామీర్‌పేట రాజీరహదారి పక్కనే ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అయ్యప్పస్వాములకు ఘన స్వాగతం పలికి ఆతీథ్యం ఇచ్చి వారికి కొన్ని గంటల పాటు వసతి సౌకర్యం కల్పించారు. శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారిని వారుదర్శించుకున్నారు. అయితే ఈ నెల 17వ తేదీన శ్రీరాచ విద్యాసాగర్‌గురుస్వామి ఆశీస్సులతో ప్రయాంకరావు, మధుసూదన్ గురుస్వామి, పోతుగంటి రాజేందర్‌గౌడ్ గురుస్వామి వారి ఆధ్వర్యంలో మెట్‌పల్లి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన అయ్యప్పమాలధారస్వాములు రాజీవ్ రహదారిన పాదయాత్రగా బయలు దేరి శామీర్‌పేటకు సోమవారం ఉదయం చేరుకున్నారు. సాయంత్రం వారు తిరిగి శబరిమలైకి అయ్యప్పస్వాములు పాదయాత్రగ బయలు దేరి శ్రీస్వామియేశరణం అయ్యప్ప అంటూ వారు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట గౌడ సంఘం సభ్యులు దూడల వెంకటేశ్‌గౌడ్, దేశం సత్యస్వామిగౌడ్, నరేశ్‌గౌడ్, పలువురు పాల్గొని సౌకర్యాలు చూశారు. శబరిమలైకి పాదయాత్ర సుమరుగ రెండు నెలల పాటు కొనసాగవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

మేడ్చల్, అక్టోబరు 21, ప్రభాతవార్త ః మతి స్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన చింతల దశరథ (68) మతి స్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 19 వ తేదీన ఉదయం 9 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతనికోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకి లభించక పోవడంతో అతని కోడలు నాగమణి సోమవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను అందించాలి

దోమ,అక్టోబరు 21 ప్రభాతవార్త : మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను వెంటనే అందించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మత్స్యసహకార సంఘం మాఈ డైరెక్టర్ బి.అనంతయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ వర్షాకాలంలో అన్ని చెరువుల్లోకి పుష్కలంగా నీళ్ళువచ్చి చెరువులు నిండుకుండాల్లా ఉన్నాయని అన్నారు. చేపపిల్లలను ఖరీదుచేయాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళి తీసుకురావడం జరుగుతుందని, లక్షలరూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. పేదవారు అయిన మత్స్యకారులకు ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను అందిస్తే వాటినిపెద్దగా చేసుకొని చేపలుపట్టుకుంటు జీవనం సాగిస్తారని అన్నారు. గత ప్రభుత్వంలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమము చేయడముతో మత్స్యకారులు ఎంతోసంతోషించారని అన్నారు.ఈ ప్రభుత్వం కూడ ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమము వెంటనే చేపట్టాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనల వెల్లువ

పోటీలకు ఎంపికైనందున వారిని అభినందించిన టిఆర్ఎస్ఎంఎ ఉపాధ్యక్షులు గోనెహనుమంతరెడ్డి, ప్రిన్సిపల్ జంగారెడ్డి

శామీర్‌పేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :రాష్ట్ర స్థాయి ఖోఖో జూనియర్ పోటీలకు తూంకుంట విజ్ఞాన్‌భారతి హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావటంతో వారిని మేడ్చల్ జిల్లా టిఆర్ఎస్ఎంఎ ఉపాధ్యక్షులు గోనెహనుమంతరెడ్డి, ఆ స్కూల్ ప్రిన్సిపల్ జంగారెడ్డిలు,పలువురు ఉపాద్యాయులువారిని అభినందించారు. సోమవారం ఉదయం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని ఆస్కూల్‌లో అయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్ అండర్-18 పోటీల్లోపాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన తూంకుంట స్కూల్‌లోవారిని అభినందించారు. ఆ స్కూల్‌లో చదువు తున్న పదవతరగతికి చెందిన మజ్జి సాయికుమార్, ఎనిమిదవ తరగతికి చెందిన బొమ్మబన్నీలు పోటీల్లో పాల్గొననున్నారు. అయితే సోమవారం నుంచి సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించబడే శిక్షణా శిబిరంకు విద్యా ర్థులను తూంకుంట విజ్ఞాన్‌భారతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ జంగా రెడ్డి, జిల్లా టిఆర్ఎస్ఎంఎ ఉపాధ్యక్షులు గోనె హను మంతరెడ్డి, వ్యాయామ ఉపాద్యాయులు ప్రశాంత్‌రెడ్డిలు, పలువురు ఉపాద్యాయులు వారిని అభినందించి పంపించారు. ఈ నెల 28వ తేదీ నుంచి మహబూబ్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరుగనున్నాయి. దీనిలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనటం సంతోషంగా ఉందని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయం సాధించాలని వారు ఆశాభావంను వ్యక్తం చేశారు.

ఆదర్శవార్డుగా తీర్చుదిద్దుతా : కౌన్సిలర్

ఆమనగల్లు, అక్టోబరు21, ప్రభాతవార్త: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15వార్డులో అన్ని విధాల మౌలికవసతులు కల్పించి ఆదర్శమైన వార్డుగా తీర్చిదిద్దుతామని కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమేధ్యేయంగాముందుకు సాగుతున్నామని, వార్డులో అవసరమైన సీసీ రోడ్లు, అంతర్గతమురుగుకాల్వలు, వీధిలైట్లు, త్రాగునీరు వసతులు కల్పిస్తున్నామని ఆయన వివరించారు. ఉదయ్ నగర్ కాలనీలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగుకాల్వ పనులను సోమవారం లక్ష్మణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. దశలవారీగా అన్ని వీధులలో సీసీరోడ్లు నిర్మాణం కూడా చేపడుతామని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాలనీవాసులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల అండ

బాధితకుటుంబానికి నగదును అందజేస్తున్న బాల్యమిత్రులు

మాడ్గుల, అక్టోబరు21, ప్రభాతవార్త: మండల పరిధిలోని పలుగుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పడమటి తండాకు చెందిన జాటావత్ జైపాల్‌నాయక్ గత ఆగస్టు మాసంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అకాలమరణం చెందాడు. బ్రాహ్మణపల్లిలో చిన్నప్పుడు కలిసి చదువుకున్న బాల్యమ

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివయ్య

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య

హుస్నాబాద్ రూరల్(అక్కన్నపేట), అక్టోబరు 21,ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. సోమవారం అక్కన్నపేట మండలం జనగామ, గొల్లకుంట, కేశనాయక్‌తండా, రామవరం గ్రామాల్లో సెర్ఫ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, ఏపిఎం శ్రీనివాస్‌గౌడ్, ఏఈవోలు, సీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 21, ప్రభాతవార్త : రైతులు పండించిన ప్రతి వరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దుతు ధరను అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం అదనంగా అందిస్తుందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీరాములు, ఎపిఎంలు విజయనిర్మల, చంద్రం, ఎవో పరశురాంరెడ్డి, పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, కలీం, లక్ష్మీ సాంబమూర్తి, మహిపాల్‌రెడ్డి, మహేందర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

మాట్లాడుతున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, అక్టోబరు 21, ప్రభాతవార్త : ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధరను అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ చైర్మన్ రాజలింగారెడ్డితో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామీణప్రాంతాల్లో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న రకం వడ్లకు అదనంగా ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రంలో పిఎసిఎస్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతూరి వెంకటస్వామిగౌడ్, గజ్జల సాయిలు, నేరెళ్ల భూమాగౌడ్, అల్వాల కిష్టయ్య, భూపతిగౌడ్, సారంగ సురేష్, మిద్దె మహేష్, మహేందర్‌రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలలో అందరికీ భాగస్వామ్యం కల్పించాలి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మాట్లాడుతున్న సునీతారెడ్డి

కొల్చారం, అక్టోబరు 21 ప్రభాతవార్త: గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలలో అందరికీ భాగస్వామ్యం కల్పించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలలో అందరినీ బాగస్వామ్యం చేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే లబ్ధి చేకూరేలా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ అనుకున్న కార్యకర్తలకు న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నారని, అధికారులు సైతం వారికి సహకరిస్తున్నారని విమర్శించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ అన్ని పార్టీలకు భాగస్వామ్యం చేసి ప్రజలందరికీ ఇందిరమ్మ కమిటీలు న్యాయం చేసేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, కాశీనాత్, యూత్ ఐకాన్ రవితేజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ నాయక్, తలారి దుర్గేష్, చిట్కుల సురేష్, సోమ నర్సింలు, ఆరె రవీందర్, దొడ్ల ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేగుంట, అక్టోబరు 21 ప్రభాతవార్త: సకాలంలో వరి ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం జిల్లా కోఆపరేటివ్ మార్కెట్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్ర ఇన్‌ఛార్జి టి.వినోద్‌కుమార్ నేతృత్వంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ఇబ్బంది పడకుండా ఈ సారి ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు చేతికొచ్చిన వరి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. దీంతో అకాల వర్షాలకు వరి ధాన్యం పాడవకుండా ఉంటుందన్నారు. దొడ్డు రకం వడ్లకు క్వింటాకు రూ.2320, రెండవ రకానికి రూ.2300 ధర నిర్ణయించారన్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తున్నామని తెలిపారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

కొల్చారం, అక్టోబరు 21 ప్రభాతవార్త: రైతుబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ అన్నారు. సోమవారం కొల్చారం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ ఆధ్వర్యంలో రైతుబంధు నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరు మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై మండల నాయకులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం తహశీల్దార్ గఫార్ మియాకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, కాశీనాత్, యూత్ ఐకాన్ రవితేజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ నాయక్, తలారి దుర్గేష్, చిట్కుల సురేష్, సోమ నర్సింలు, ఆరె రవీందర్, దొడ్ల ఆంజనేయులు, ఏడుపాయల డైరెక్టర్లు బాగారెడ్డి, కొమ్ముల యాదాగౌడ్, చిట్యాల యాదయ్య, మనోహర్, పట్లోరి నర్సింలు, వేమారెడ్డి, సందీప్, రాజాగౌడ్, చెన్నయ్య, ముత్యం ప్రవీణ్, వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

జాతీయ మాల మహానాడు మండల కన్వీనర్ రాజశేఖర్

అక్కన్నపేట, అక్టోబరు 21,ప్రభాతవార్త ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు ఈనెల 25 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న మాలల మహాపాదయాత్రలో మాలలు, ఉపకులాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అక్కన్నపేట మండల కన్వీనర్ కామాద్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అంతకపేట గ్రామంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అంబేద్కర్ ఆశయాలకు గొడ్డలిపెట్టు అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మౌళిక సూత్రాలను దెబ్బకొట్టేలా న్యాయ వ్యవస్థను రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. రాజ్యాగ విరుద్ధంగా వర్గీకరణ ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్‌తో పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పాయయాత్ర భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు 1000 కిలోమీటర్లు ఉంటుందని, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌తోపాటు ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, జాతీయ మాల మహానాడు సలహాదారులు కామాద్రి మురళి రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని, మాలలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండె వెంకటస్వామి, మాల సంఘం గ్రామ అధ్యక్షులు కామాద్రి బుచ్చయ్య, ఆరుట్ల కొమురయ్య, వెంకటయ్య, నర్సయ్య, కార్తీక్, వినోద్, నరేష్, వజ్రవ్వ, ఎల్లవ్వ, రేనవ్వ, జానవ్వ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 21ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, వర్షాకాలం పంటలు పూర్తయినా ఇప్పటివరకు రైతుబంధు అమలు చేయలేదని, వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులను జమ చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్‌స్టాండ్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ కింద మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని మోసం చేసిందని, ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌ప్రభుత్వం ఇప్పటి వరకు సగం రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. ఎన్నో వాగ్ధానాలు చేసిన ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయకపోగా రైతులకు రైతుబంధు ఇస్తామని నమ్మించి తీరా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఎకరానికి రూ.15000 ఇచ్చేవరకు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ వెన్నంటే ఉంటుందన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు జీవో 29 రద్దు చేయాలని ధర్నా చేస్తుంటే వారిపై లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమైన చర్య అని, ప్రజలు వారికి గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నో హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయడం లేదని, అన్నీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, అశోక్‌గౌడ్, బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచులు అశోక్‌రెడ్డి, శేఖర్, శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆటకు మండల విద్యార్థి ఎంపిక

చిన్నశంకరంపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ ఆటలో మడూర్ జడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి అరవింద్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ఆడటానికి ఎంపికయ్యాడు. 28 నుండి 30వ తేదీవరకు పెద్దపల్లిలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఆటలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు నరేష్ తెలిపారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఎస్‌జిఎఫ్ క్రికెట్ క్రీడోత్సవాలకు జోగిపేట విద్యార్థిని ఎంపిక

చౌటకూర్, అక్టోబరు 21 ప్రభాతవార్త: జోగిపేట పట్టణానికి చెందిన అల్లాదుర్గం సాగ్వీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ క్రీడోత్సవాలకు ఎంపికైంది. జోగిపేట పట్టణానికి చెందిన డాక్టర్ అల్లాదుర్గం శ్రీకాంత్, డాక్టర్ కరుణ దంపతుల కుమార్తె సాగ్వీ స్థానిక సాయి కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తుంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఎంఎస్ క్రికెట్ అకాడమీలో రెండు రోజుల క్రింత ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 విభాగం పోటీల్లో సాగ్వీ ఎంపికయ్యారు. కూతురు ఎస్‌జీఎఫ్ క్రికెట్ క్రీడోత్సవాలకు ఎంపిక కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు డాక్టర్ అల్లాదుర్గం శ్రీకాంత్, డాక్టర్ కరుణలు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయిలో రాణిస్తున్న సాగ్వీ భవిష్యత్తులో మరింత రాణించాలని వారు ఆకాంక్షించారు.

చరిత్రాత్మక కట్టడాన్ని పరిరక్షించాలి

నర్సాపూర్ అక్టోబరు 21, ప్రభాతవార్త: నర్సాపూర్‌ని నియోజకవర్గంలోని చిలిపిచెడ్ మండలం జగ్గంపేటలో చారిత్రాత్మక పురాతన కట్టడాన్ని పరిరక్షించాలని కోరుతూ మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి సోమవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ పాండురంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోగల పురాతన కట్టడం(గౌని) కొందరు కూల్చివేసి ఆ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరగా ఇందుకు స్పందించిన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వెంటనే చిలిపిచెడ్ మండల తహశీల్దార్ కు ఫోన్ చేసి విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నర్సాపూర్‌లో నూతనంగా కెనరా బ్యాంక్ ప్రారంభం

బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: సిజిఎం

నర్సాపూర్ అక్టోబరు 21, ప్రభాతవార్త: పట్టణంలో సోమవారం కెనరా బ్యాంక్ బ్రాంచిని ప్రారంబించడం జరిగింది. బ్యాంక్ ప్రారంభోత్సవానికి కెనరా బ్యాంక్ మేనేజర్ యుగందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా పద్మశ్రీ పి.హన్మంతరావు, వ్యాపారవేత్త రాఘవేందర్‌రావు, బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ హన్మంతరావు, సిజిఎం చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా నూతన కెనరా బ్యాంక్ నర్సాపూర్ బ్రాంచిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యాపారులు, రైతులు, ప్రజలు కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కౌన్సిలర్ బుచ్చెష్‌యాదవ్, కంది ప్రబాకర్‌రావు, పుర ప్రముఖులు బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను బోధించలేం

చిత్ర దర్శకుడు నీలకంఠ

పటాన్‌చెరు, అక్టోబరు 21, ప్రభాతవార్త: నిజమైన సృజనాత్మకత లోపల నుండి వస్తుందని, అది బోధించలేనిదని రెండుజాతీయ, ఐదు నంది అవార్డులు గెలుచుకున్న ప్రఖ్యాత చిత్ర దర్శకుడు నిలకంఠ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లో షుటింగ్ నీలకంఠ పేరిట సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో తన అంతర్దృష్టిని పంచుకున్నారు. బహుముఖ ప్రజ్ఞ, వినూత్నమైన కథలు, సినిమాల్లో మార్పులేనితనం ప్రాముఖ్యతలను వివరిస్తూ, ఒక్కొక్కటి మూడు లేదా నాలుగు కళా ప్రక్రియల కలయికతో నేను విభిన్న రకాల చిత్రాలు చేశాను. ప్రయోగాలు చేస్తూ ఉండండి, అది మీ మనస్సును చురుకుగా, సజీవంగా ఉంచుతుంది. మీరు ఎల్లప్పుడూ కొత్త దనాన్ని ఉత్పత్తి చేస్తున్నారని నిర్ధారించుకోవడానికి తాజా ఆలోచనలతో విభిన్న మార్గాలను అనుసరించండి అని ఉద్బోధించారు. సినిమాపై తన తొలి ఆసక్తిని గుర్తు చేసుకుంటూ నీలకంఠ తన ప్రయాణం 13,14 ఏళ్ల చిన్న ప్రాయంలోనే ప్రారంభమైందని అన్నారు. ప్రముఖ దర్శకుడు బాపు దర్శకత్వం వహించిన బుద్ధిమంతుడు చూసిన తరువాత కెమెరా వెనుక మాయాజాలం జరిగేలా ఎవరో ఉన్నారని తాను గ్రహించానని తెలిపారు. ఈ ఆవిష్కరణ తనలో సినిమా పట్ల ఉత్సుకత అభిరుచిని పెంచిందని, విజయవాడలోని లీలామహల్, నవరంగ్ టాకీస్‌లు తన నేర్చుకునే దేవాలయాలుగా ఆయన అభివర్ణించారు. ఫిలిం స్కూల్స్ సినిమా తీసే మెళకువలను బోధిస్తాయే తప్ప సృజనాత్మకతను కాదని సృష్టికరించారు. చలన చిత్రాలను గమనించడం, వాటి సూక్ష్మ నైపుణ్యాలను మెచ్చుకోవడం, ఆ పాఠాలను అంతర్గతీకరించడం ద్వారా తనకు సీని జ్ఞానం, ప్రేరణ వచ్చాయని తెలిపారు. నీలకంఠ ఆయన పనితీరును పరిచయం చేస్తూ నిర్వాహకులు, పరిమాణం కంటే నాణ్యతను విశ్వసించే ఒక అద్భుతమైన చిత్ర దర్శకుడిగా ఆయనను అభివర్ణించారు. షో, మిస్సమ్మతో సహా ఆయన చిత్రాలు బలమైన పాత్రలు, అర్థవంతమైన కథలు, వినోదం, ఆత్మపరిశీలన మధ్య సమతుల్యతను సాధించడంలో ఆయన ప్రతిభను ప్రదర్శిస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని వెంకట సుబ్బు పేటేటి సమన్వయం చేయగా డాక్టర్ సుష్మవందన సమర్పణతో ముగిసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పావన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: గుర్తు తెలియని వ్యక్తి (65-70) ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ పరిసరాల్లోని హరిత హోటల్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి నీరసంగా పడి ఉండగా చికిత్స నిమిత్తం గుర్తు తెలియని వ్యక్తిని శనివారం ఆసుపత్రికి తరలించిన విషయం పాఠకులకు విధితమే. స్థానికుల సమాచారంలో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ సోమవారం కానరాని లోకాలకు చేరిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే 8712657920కు సమాచారం అందించాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సూచించారు.

మరుగుదొడ్లు లేక అడ్డా కూలీల ఇక్కట్లు

గుమ్మడిదల, అక్టోబరు 21 ప్రభాతవార్త: గుమ్మడిదల గ్రామ పంచాయతీ స్థానిక కానుకుంట కూడలిలో వివిధ గ్రామాల నుంచి రోజువారి కూలీలు, కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు సుమారు 12 గ్రామాల నుంచి నిత్యం సమీప ప్రాంతమైన హైదరాబాద్ పట్టణానికి పనుల నిమిత్తం వెళుతూ, వస్తూ ఉంటారు. అదేవిధంగా కూలీపని వారు కొడిపల్లి, నర్సాపూర్, దౌల్తాబాద్, దూర ప్రాంతాల నుంచి నిత్యం ఇక్కడికివచ్చి అడ్డకూలిగా పనిచేస్తూ ఉంటారు. వారికి బస్టాండ్ సమీపంలో కూలి అడ్డగా మారింది. ఆడవారికి కనీసం మరుగుదొడ్డి వసతి సదుపాయం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై మాజీ పాలకవర్గం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. ఆడవారికి, విద్యార్థులకు, నిత్యం ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులుకు గురవుతున్నా కనీసం అటువైపు కన్నెత్తి చూడటంలేదు. పలుమార్లు పత్రికల్లో ప్రచురించినా మాకేంటిఅంటూ పట్టించుకోవడం లేదు. గుమ్మడిదలలో గొప్పలు చెప్పుకునే బడా నాయకులు ఎందరో ఉన్నారు. మరుగుదొడ్డి సదుపాయం కల్పించడానికి వసతులు ఎన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు పరిస్థితి తయారైంది.

ఇప్పటికైనా గుమ్మడిదల బస్టాండ్ పరిసర ప్రాంతంలో మురుగుదొడ్ల వసతులు కల్పించాలని ఇక్కడి ప్రయాణికులు, విద్యార్థులు, దినసరి కూలీలు, మహిళలు నాయకులకు, అధికారులకు విన్నవించుకుంటున్నారు.

గుమ్మడిదలలో కూలీల అడ్డ



ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు

బిఆర్ఎస్ పార్టీ నేతల వినూత్న నిరసన

కొల్చారం, అక్టోబరు 21 ప్రభాతవార్త: ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ కుర్చీకి మెమోరాండం ఇచ్చి బీఆర్ఎస్ పార్టీ నేతలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కొల్చారం మండలంలో ఇందిరమ్మ కమిటీల ఎంపికలో అవకతవకలను నిరసిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. నేతలు కార్యాలయానికి వెళ్లిన సమయంలో ఎంపీడీవోతో సహా సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. దీంతో బీఆర్ఎస్ పార్టీ నేతలు వినతిపత్రాన్ని ఎంపీడీవో ఛాంబర్‌లోని ఖాళీ కూర్చీరి మెమోరాండం ఇచ్చి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీనేతలు ఇంద్రసేనారెడ్డి, ముత్యం ప్రవీణ్‌కుమార్, ముత్యంగారి సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఎంపీడీవోతో సహా సిబ్బంది గైర్హాజరై ఖాళా కుర్చీలు దర్శనం ఇవ్వడంపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతుల గౌరీ శంకర్, సంతోష్ రావు, నరేందర్‌రెడ్డి, ముత్యం ప్రవీణ్, రవితేజారెడ్డి, నింగోళ్ల సత్యనారాయణ, మురళిగౌడ్, పండ్ల వెంకటేశం, రాజాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ముల యాదాగౌడ్, బాగారెడ్డి, చిట్యాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 21 ప్రభాతవార్త: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు ఎలాంటి షరతులు లేకుండా రూ.500 బోనస్ ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

Main-IV(MDK) - oct 21:Main-IV(MDK) - oct 21.qxd 10/21/2024 8:56 AM Page 1

శివ్వంపేటలో బిఆర్ఎస్ ధర్నా



శివ్వంపేటలో ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, అక్టోబర్ 21 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీగా రైతులకు రైతుభరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా ఇవ్వడంలేదని మండల పార్టి అధ్యక్షులు రమణగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించి సీఎం దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా మాజి జెడ్పిటీసి మహేష్‌గుప్త, మాజి జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రగౌడ్, మాజి జిల్లా కోఆప్షన్ సభ్యులు మాన్సూర్, మాజి ఎంపిపి హరికృష్ణలు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇస్తామని చెప్పి 10నెలలు గడిచినా, రైతుభరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని, అనవసర కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలపక్షాన పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, నాయకులు యాద గౌడ్, ఆకుల శ్రీనివాస్, మాజి సర్పంచులు, మాజి ఎంపిటీసిలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శివ్వంపేట, అక్టోబర్ 21, (ప్రభాతవార్త): మండలంలోని దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గేడి జ్యోతి కొన్నిరోజుల క్రితం పాము కాటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న జెడ్పిటీసి పబ్బ మహేష్‌గుప్త పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాంలో మాజి రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగేశ్వరావు, మాజి సర్పంచ్ దుర్గేష్, నాయకులు కన్నరం రమేష్, నర్సిలు, కన్నరం స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు ఠాణాలో అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు

పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్

అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 1999 సెప్టెంబరు 13న పాపన్నపేట పోలీసు ఠాణాను మావోయిసట్టులు పేల్చి వేయడం చాలా బాధకరమన్నారు. ఠాణాలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు అమరులు కావడం దురదృష్టకరమని, వారి సేవలను మనం ఎప్పుడు మరిచిపోలేమన్నారు. శాంతి భద్రతల కొరకు పోలీసులు రాత్రి పగలు తేడా లేకుండా పని చేస్తున్నారని, అందుకు ప్రజలు పోలీసులకు తమ వంతు సహకారం అందిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ బస్వరాజ్, ప్రవీణ్, నర్సింలు, కృష్ణ వెంకటేష్, చింటూ బాయి తదితరులు పాల్గొన్నారు.

నాగ్సాన్‌పల్లి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

నాగ్సాన్‌పల్లి పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామంలోని పాఠశాలను మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మెటివ్ పరీక్షల నిర్వాహణను పరిశీలించారు. పాఠశాలకు కొత్తగా నియమితులైన స్కావేంజర్‌లతో ఎంఈఓ ప్రత్యేకంగా మాట్లాడి క్రమశిక్షణతో సమయ పాలన పాటించాలని సూచించారు.

పాత పెన్షన్ హామీని అమలు చేయాలి

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టిజీ సిపిఎస్ఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగ నరసింహులు వినతిచేశారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో స్థానిక విలేఖరులతో నరసింహులు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాతపెన్షన్ విధానాన్ని అమలుచేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఉద్యోగులకు రావాల్సిన 5డిఏలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు.

రాజీవ్ రహదారిపై అయ్యప్ప నామస్మరణ

కొండపాక, అక్టోబర్ 21, ప్రభాతవార్త: స్వామి శరణం అయ్యప్ప శరణం అంటు అయ్యప్ప నామస్మరణ రాజీవ్ రహదారిపై సోమవారం మార్మోగింది. సిద్దిపేట పట్టణం నుండి శబరి వరకు ప్రారంభించిన పాదయాత్ర రెండవరోజు కొండపాక మండలంలో కొనసాగింది. మెదక్ ఇంజనీరింగ్ కళశాల ముందు అయ్యప్పభక్తులను డప్పుచప్పుల్లతో స్వాగతం పలికారు. అక్కడే ఉన్న హనుమన్ దేవాలయంవద్ద భక్తులకు భిక్షను అందించారు. ఈ సందర్భంగా ఇల్లందు స్వామి అయ్యప్ప స్వాములను సన్మానించి, 41 రోజులకు సరిపడా తినుబండారాలను, వంట సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, దుర్గారెడ్డి, కన్నెస్వామి అరుట్ల యాదవరెడ్డితోపాటు జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, హుస్నాబాద్ తదితర ప్రాంతాల నుండి దాదాపు 120 మంది భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. దుద్దెడ, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో స్వాముల పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది.

మృతుని కుటుంబానికి సహాయం

కొండపాక, అక్టోబర్ 20, ప్రభాతవార్త: కొండపాక మండల పరిధిలోని రవీంద్రనగర్-విశ్వానాథ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిదిలో గొడుగు కనకయ్య గతకొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ మంద కొమురయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదర్చారు. అనంతరం మృతుని కుటుంబనికి 50కిలోల బియ్యం సహాయంగా అందించారు.

రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

కొండపాక, అక్టోబర్ 20, ప్రభాతవార్త: వానకాలం రైతుబంధు నిధులను వెంటనే విడుదలచేసి రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధంచేసి రాజీవ్ రహదారిపై ధర్నా చేశారు. కుకునూరుపల్లి, కొండపాక మండలాల బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కుకునూరుపల్లి మండల నాయకులు కుకునూరుపల్లి బస్‌స్టాండ్ వద్ద మాజీ రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దేవిరవీందర్ ఆధ్వ ర్యంలో, కొండపాక నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వ ర్యంలో రాజీవ్ రహదారిపై వెలికట్ట క్రాస్ రోడ్డులో సిఎం దిష్టిబొమ్మను దగ్ధంచేసి, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ అదేశాలమేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిందని సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను తప్పి రైతులను మోసంచేశారని మండి పడ్డారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని అగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే రైతుబంధు నిదులను విడుదల చేయాలన్నారు. చరిత్రలో ఇప్పటివరకు ఎక్కడలేని విధంగా రైతుబంధు ఎకరానికి రూ.10 వేలు చెల్లించిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. హైడ్రాకు, మూసినదికి లేని కమిటీలు రైతుబంధుకు ఎందుకని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి కాలి పోకతప్పదన్నారు. ఇప్పటికైనా నిధు లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలతో రాజీవ్ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే భారీసంఖ్యలో నిలిచిపోవడంతో పోలీసులు ధర్నాను విరమింప జేశారు. మాజీ సర్పంచులు కిరణ్‌కుమార్, బచ్చలిమహిపాల్, కొలశ్రీనివాస్, కనకయ్య, మల్లమారి రవీందర్, దశరథం, పిఎసిఎస్ వైస్‌చైర్మన్ అమర్, పిఎసిఎస్ డైరెక్టర్ బాల్‌నర్సయ్య, లగిశెట్టి కనకయ్య, ఈగస్వామి, మాజీఎంపిటీసి భూములు గౌడ్, పాలశంకర్, మల్లంఐలయ్య, గొనెశ్రీనివాస్, దోమలఎల్లం, భానుచందర్, యాదగిరి, చంద్రశేఖర్, గొటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు21, ప్రభాతవార్త: పిడుగుపాటుకు పాడి ఆవు మృతిచెందిన సంఘటన హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, సోమవారం పోతారం (ఎస్) గ్రామానికి చెందిన బైరి లక్ష్మీకొమురయ్యకు సంబంధించిన పాడి ఆవు మద్యాహ్నం కురిసిన వర్షంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మృతిచెందిన ఆవు విలువ రూ 50వేల వరకు ఉంటుందని, ఈవిషయంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టి రైతుకు నష్టపరిహారం అందించాలని వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు వేడుకుంటున్నారు.

విమర్శించే హక్కు బిఆర్ఎస్‌కు లేదు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబరు 21, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఆదివారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హుస్నాబాద్‌లో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు బంక చందు

ఎప్పుడు విఫలం కాలేదని, కాంగ్రెస్ హామీయిస్తే అమలుచేయడంలో వెనకడుగు వేయదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలుచేసుకుంటూ వస్తోందన్నారు. బిఆర్ఎస్ నాయకులు తప్పుడుప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ రవిందర్, కౌన్సిలర్లు వల్లపు రాజు, కోమటి స్వర్ణలత, నాయకులు బురుగు కిష్టస్వామితోపాటు తదితరులు పాల్గొన్నారు.

అమరులైనవారి కుటుంబాలకు అండగా ఉంటాం

అమర పోలీసులకు నివాళి అర్పిస్తున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు21, ప్రభాతవార్త: విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరపోలీస్ కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరంలో నక్సలైట్లు ఏర్పాటుచేసిన మందుపాతర పేలి మృతిచెందిన ఎస్ఐ జాన్‌విల్సన్, సిఐ యాదగిరిలతోపాటు సిబ్బందికి నివాళి అర్పించారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పో యిన అమరపోలీసులను స్మరించుకున్నారు. హుస్నాబాద్ సిఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేష్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్‌చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డితోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

ఝరాసంగం, అక్టోబరు 21, ప్రభాతవార్త: ఆత్మహత్య చేసుకున్న మండల కేంద్రమైన ఝరాసంగంకు చెందిన దంపతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సోమవారం పరామర్శించారు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన దంతపులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు విధితమే. సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, యువజన నాయకులు ఉదయ్ శంకర్‌పాటిల్‌లు వేరు వేరుగా దంతపుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజావాణిలో రెవిన్యూ సమస్యలపై ఫిర్యాదు

సిర్గాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రెవిన్యూకార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవిన్యూ సమస్యలపై ఫిర్యాదు అందినట్లు తహసీల్దార్ ఉమా శంకర్ తెలిపారు. ప్రజావాణిలో అందిన ధరఖాస్తులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరిస్తామని, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రజావాణిలో ధరఖాస్తు చేసుకోవచ్చని మండల ప్రజలకు సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయిన కరెన్సీ నోట్లు

పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం అయిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం, గ్రామానికి చెందిన కోదండం సాయిలు బూడగజంగం కాలనీలో రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇంట్లో నుంచి పనులు చేసుకునందుకు సాయిలు బయటకు వెళ్లిపోయిన తరుణంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఇంట్లో నుంచి పొగలు కమ్ముకుని వస్తుండటాన్ని గమనించిన కాలనీ వాసులు ఫైర్ ఇంజన్ కార్యాలయానికి కాల్ ఏసి మంటలను ఆర్పే యత్నం చేశారు. అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఇంట్లో బీరువాలతో ఉన్న డబ్బులు, బంగారం, వెండి ఆభరణాలు, నిత్యావసర సరుకలు, వస్తువులు, మంటల్లో కాలిపోయాయి. ఇల్లు కాలిపోయిన సంఘటనలో సుమారుగా 4లక్షల రూపాయల వరకు ఆస్థి నష్టం వాటిల్లిందని, బాధితులు సాయిలు వాపోయాడు.

మాణిక్యం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మనూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండలంలోని తమ్పూర్ గ్రామానికి బిఆర్ఎస్ కార్యకర్త గంగాపురం మాణిక్యం ఇటీవల కానరాని లోకాలకు చేరిపోయినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం మాణిక్యం నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యేవెంట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మాజీ జడ్పీటిసిసభ్యులు నాగేందర్‌రావు పాటిల్, గ్రామ బిఆర్ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, గుండన్న, శ్రీనివాస్‌రెడ్డి, యం రామ్‌రెడ్డి, బక్కారెడ్డి, యం రాములు, యేసయ్య, రాజు, విఠల్ గొండ, మాణికయ్య కుటుంబ సభ్యులు సాయిలు, యాదయ్య, తుకారాం, ప్రేమ్‌దాస్, విజయ్‌కుమార్ ఉన్నారు.

అయోడిన్ లోపంతో ఎన్నో అనర్థాలు

అయోడిన్ లోపంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాక, అక్టోబర్ 21, ప్రభాతవార్త: అయోడిన్ మూలకం మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో అవసరమని ఇంచార్జీ డిఎంఅండ్‌హెచ్ఓ ఎన్. అనంద్ అన్నారు. సోమవారం కొండపాకలోని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగహన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, బుద్ధిమాంద్యం, చురుకుగా లేకపోవడం, గాయిటర్, అడవారిలో గర్భస్రావం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడడం, మరుగుజ్జుతనం వంటి అవలక్షణాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. అవగహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఒ ఎన్‌సిడి డాక్టర్ నారాయణరావు, స్థానిక వైద్యులు శ్రీధర్, జిల్లా ప్రోగ్రాంకోఆర్డినేటర్స్ రాజేందర్, రమణ, డిపిఎంఒ లక్ష్మణచారి, హెఈఒ రమణ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

రాయికోడ్, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన రాయికోడ్‌లో కొనసాగుతున్న శ్రీఆంజనేయస్వామి ఆలయ పున:ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను పార్టీ నాయకులు, ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చేవెళ్ల విఠల్, మాజీ ఆలయ కమిటి అధ్యక్షులు సంగమేశ్వర్ పాటిల్, వరం వైస్ ప్రెసిడెంట్ తుకారం, మండల యూత్ అధ్యక్షులు అంజిముదిరాజ్, లక్ష్మణ్, బీరదర్ హనుమంతు, నాగరాజ్, పాండురంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్‌గా లక్ష్మి

అల్లాదుర్గం, అక్టోబరు 21, ప్రభాతవార్త: వట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్‌గా కొప్పుల లక్ష్మి శేషారెడ్డి నియమితులయ్యారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి సతీమణి కొప్పుల లక్ష్మిని చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా ఉత్తర్వులు అందచేశారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న పోలీసులు

రామాయంపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త: పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పోలీసు శాఖ రక్తనిధి కేంద్రం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆ తర్వాత శిబిరంలో రక్తదానము చేసిన రక్తదాతలకు ప్రూటి మరియు పండ్లను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ, మరియు లయన్స్ క్లబ్ రామాయంపేట, స్నేహబంధు, లయన్స్ క్లబ్ చేగుంటలు పాల్గొన్నాయి. ఈ శిబిరంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ మహేందర్, రెడ్‌క్రాస్ చైర్మెన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ లయన్ పొడెంద్ల లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి లయన్ టి.సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డి.జి.శ్రీనివాసశర్మ, మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ వి.దామోదర్‌రావు, లయన్ దేమె యాదగిరి, లయన్ వి.కైలాసం, జలాలుద్దీన్, అశోక్, లయన్ జి.పి.స్వామి, లయన్ నాగరాజు, లయన్ రామచంద్రం, లయన్స్ జిల్లా చైర్మెన్ నాగ రాజులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. 103మంది రక్తదాతలు రక్తదానం చేయడం జరిగింది. కాగా, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌నుండి సిబ్బంది రక్తదానం చేశారు.

జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ ఎన్నికలు

ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు

జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త: జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26న పట్టణంలోని శ్రీ బసవ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు అడిగే జగదీశ్వర్, న్యాయవాది బసవరాజ్, మల్లికార్జున్ పాటిల్, శివచంద్ర పాటిల్, అవంతి సుధాకర్, సులగంఇ సత్యవ్రతలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సర్వ సభ్య సమావేశంలో 2024-26 సంవత్సరానికి సంబంధించి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికల నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా ఎన్నికల అధికారులను ఈ నెల 25వ తారీఖు సాయంత్రం 5 గంటల లోపు తమ ధరఖాస్తులను అందచేయాలన్నారు.

సిఎం రిలీఫ్ పేదలకు ఎంతో మేలు

శివ్వంపేట, అక్టోబర్ 21 (ప్రభాత వార్త): సీఎం రిలీఫ్ పేదలకు ఎంతో మేలు అని మాజీ జెడ్పిటీసి పబ్బ మహేష్‌గుప్త అన్నారు. సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామనికి చెందిన దొడ్లే అశోక్‌కు మంజూరైన 15వేల రూపాయలు, అదేగ్రామానికి చెందిన గంగళ శైలజకు మంజూరైన 28వేల5వందల రూపాయలు సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కు లబ్దిదారులకు మాజీ జెడ్పిటీసి పబ్బ మహేష్‌గుప్త అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ప్రతి పేద కుటుంబానికి సీఎం రిలిఫ్ ఫండ్ వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి హరికృష్ణ, మాజి జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్, మాజి జిల్లా కొఆప్షన్ సభ్యులు మన్సూర్, మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు లాయక్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్దలో అమరవీరుల దినోత్సవం

నాగల్‌గిద్దలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న పోలీసులు

నాగల్‌గిద్ద, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని పోలీసు ఠాణాలో సోమవారం పోలీసుల అమరవీరుల దీనోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయిలు విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల త్యాగాలను, సేవలను స్మరించుకున్నారు. అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్, వీరప్ప, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని అగచాట్లు

రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 21, ప్రభాతవార్త: ఒక్కసారిగా అకాల వర్షంతో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పంట వచ్చిందనుకుంటున్న సమయంలో అన్నదాతకు అగచాట్లు తప్పడంలేదు. చేతికొచ్చిన పంట నీటిపాలయ్యిందని రైతన్నలు లబోదిబోమంటూ ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయంనుండి ఎర్రటి ఎండ కాసినా, మధ్యాహ్నం వరకు ఒక్కసారిగా ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షం రావడంతో ఆరబోసిన ధాన్యం మొత్తం తడిసిపోయింది. రామాయంపేట మున్సిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడమే కాకుండా, వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. సుమారు గంటపాటు భారీ వర్షం కురువడంతో ఏమాత్రం రైతులకు అవకాశం లేకుండా పోయింది. కనీసం ఆరబోసిన ధాన్యం కుప్పలుగా చేసేందుకు కూడా వీలులేకుండా భారీ వర్షం కురిసింది. కాగా వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

రాయికోడ్, అక్టోబరు 21, ప్రభాతవార్త: మండల కేంద్రమైన రాయికోడ్‌లో కొనసాగుతున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పున:ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను పార్టీ నాయకులు, ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు చేవెళ్ల విఠల్, మాజీ ఆలయ కమిటి అధ్యక్షులు సంగమేశ్వర్ పాటిల్, వ